క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకుడు

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని పోచమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడి పర్యవేక్షణలో ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేసిన తర్వాత భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రతినెలా అమవాస్య రోజున ఆలయంలో ప్రత్యేక అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్థానిక భక్తులు వివరించారు. ఈ కార్యక్రమంలో రాజిరెడ్డి, సంజీవరెడ్డి, హరీష్‌రెడ్డి, ప్రశాంత్, శ్రీనివాస్, కిరణ్‌గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్



సైన్స్ ఫెయిర్‌ను తిలకిస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి బాపునగర్‌లోని ఇస్లామిక్ సెంటర్‌లో ప్రత్యేక సైన్స్ ఫేయిర్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్లు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రస్తుత సమాజంలో వివిధ రకాల అంశాలను ఆధారంగా చేసుకొని ఎగ్జిబిట్లను విద్యార్థులు రూపొందించి ఫెయిర్‌లో ప్రదర్శించారు. ఈ ఫెయిర్‌ను శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ ప్రారంభించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్‌గౌడ్, మహ్మద్‌ఖాలీద్, ముబాషిర్ జాఫర్, జేఐహెచ్ అధ్యక్షుడు మహ్మద్ ఖాయాముద్దీన్, అబ్దుల్‌గఫార్, సుధాకర్‌రెడ్డి, మహేష్, బషీర్ పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలు ప్రారంభం



కోహినూర్ ఆరో రియాలిటీ ప్రాంగణంలో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువస్తున్న చిన్నారులు

మాదాపూర్: హైటెక్‌సిటీలో కోహినూర్ ఆరో రియాలిటీ ప్రాంగణంలో నవరాత్రి ఉత్సవాలను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. భక్తిపాటలకు నృత్యాలు చేసి చిన్నారులు అలరించారు. నవరాత్రి దేవత నవదుర్గ విగ్రహాన్ని ఊరేగింపుగా ప్రాంగణంలోకి తీసుకువచ్చారు. ప్రతిరోజూ ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్



కార్పొరేటర్‌కు సమస్యలు వివరిస్తున్న కాలనీవాసులు

పటాన్‌చెరు టౌన్: డివిజన్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తున్నానని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని గౌతమ్‌నగర్‌లో హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీవాసులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని ప్రజలకు మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా కృషి చేస్తున్నామన్నారు. అందుకు జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి సమష్టిగా పని చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ మేనేజర్ అరుణ్‌కుమార్, సిబ్బంది కాలనీవాసులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరిహారం అందజేస్తాం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సఫ్దార్‌నగర్‌లో నాలా పక్కన ఉన్న ఒక ఇంటి గోడ ప్రమాదవశాత్తు కూలిపోవడంతో ఇంట్లోని వస్తువులు నాలాలో పడిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ సబిహా బేగం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి పరిహారం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

గోసాయికుంటకు మహర్దశ!

- 'కుంట' రూపురేఖలు మార్చేందుకు ప్రణాళిక
- తాజాగా జీహెచ్ఎంసీ చొరవతో మళ్లీ చిగురిస్తున్న ఆశలు
- ఇప్పటికే సుందరీకరణ కోసం శంకుస్థాపన చేసినా ఫలితం శూన్యం



కేశవనగర్‌లోని గోసాయికుంట ఇదే (ఫైల్)

రాయదుర్గం: ఎన్నో ఏళ్లుగా కళావిహీనంగా మారిన గోసాయికుంటకు మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ఈ కుంట రూపురేఖలు మారేందుకు అవసరమైన ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని సంకల్పించారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ చెంతలోనే ఉండే కేశవనగర్, టీఎన్‌జీ కాలనీ, సెక్రెటేరియట్‌కాలనీ, గౌలిదొడ్డి వంటి ప్రాంతాల్లోని గేటెడ్ కమ్యూనిటీ, అపార్ట్‌మెంట్లు, ఇతర ఇళ్లల్లో నివాసముండే వారు సేద తీరడానికి ఎంతో ఉపయుక్తంగా మారడం ఖాయం. కానీ ఆ దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ తరుణంలో జీహెచ్ఎంసీ నిర్ణయంతో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి.

5 చెరువులను సుందరీకరించాలని నిర్ణయం..

నగరంలోని 5 చెరువులను సుందరీకరించాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. అందులో భాగంగా సీఎస్ఆర్ కింద శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని గోసాయికుంటకు మహర్దశ కల్పించాలని తలపెట్టారు. అందుకోసం వాటర్ ఏయిర్ ఇండియా సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇటీవల జరిగిన జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యంగా చెరువు కట్టలను బలోపేతం చేయడం, పూడిక తీయించడం, మురుగునీరు చేరకుండా చూడడం, వాకింగ్ ట్రాక్‌లను నిర్మించాలని నిర్ణయించారు. దీంతో గోసాయికుంటకు ఇక మహర్దశ పట్టినట్లే అవుతుందని అందరూ అభిప్రాయపడుతున్నారు.

మూడేళ్ల క్రితమే సుందరీకరణకు శంకుస్థాపన..

మూడేళ్ల క్రితమే గోసాయికుంటకు రూ.1.78 కోట్లతో సుందరీకరణ పనులకు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కానీ ఇప్పటి వరకు పనులు చేపట్టలేకపోయారు. అందమైన పూలు, ఇతర ఆహ్లాదాన్ని అందించే మొక్కలు నాటాలని తలపెట్టారు. వాకింగ్ ట్రాక్, సేదతీరేందుకు కూర్చోవడానికి బెంచీల ఏర్పాటు చేయాలని తలపెట్టారు. ఉదయం, సాయంత్రం స్వచ్ఛమైన గాలి వీచ్చే వాతావరణం కల్పించి వాకర్స్‌కు అనువుగా మార్చాలని నిర్ణయించారు. అంతేకాకుండా అందరినీ ఆకట్టుకునేలా లైటింగ్ కూడా ఏర్పాటు చేయతలపెట్టారు. కుంటలోకి మురుగునీరు రాకుండా చుట్టూరా డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం చేసి మురుగునీరును మళ్లించే చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. కానీ ఏ ఒక్క పనీ చేయట్ట లేదు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని ఈ గోసాయికుంటకు మహర్దశ పట్టేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ దిశగా చర్యలు చేపడతారని స్థానికులు ఆశిస్తున్నారు.

కాలనీల సమగ్రాభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

శేరిలింగంపల్లి: కాలనీల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని శేరిలింగంపల్లి కార్పొరేటర్ తెలిపారు. డివిజన్ పరిధిలోని బాపూనగర్, గోపీనగర్, ప్రశాంత్‌నగర్‌లలో చేపట్టుతున్న సీసీ రోడ్డు పనులను స్థానికులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ..కాలనీల్లో సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామన్నారు. మౌలిక వసతులకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, రవీందర్, శ్రీనివాస్, ముక్రమ్, నర్సింహారెడ్డి, మల్లేష్, మహేష్, ప్రవీణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు దుస్తుల పంపిణీ

మోతీనగర్: అనాథలు, అభాగ్యులను ఆదుకుంటేనే జీవితానికి సంతృప్తి లభిస్తుందని బీఆర్ఎస్ బీసీ సెల్ కూకట్‌పల్లి నియోజకవర్గ అధ్యక్షుడు నాగుల సత్యం గంగపుత్ర పేర్కొన్నారు. ఆదర్శ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ ఆశ్రమ విద్యార్థులకు నూతన దుస్తులు, పండ్లను ఆదివారం పంపిణీ చేశారు. వి.రామారావు నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్.రాజుచారి, ప్రధాన కార్యదర్శి యశ్వంత్, నాయకులు సంజీవ పటేల్, బి.వెంకట యాదవ్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



గొప్ప గాంధేయవాది కొండా లక్ష్మణ్

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

పటాన్‌చెరు: తొలిమలి దశ ప్రత్యేక తెలంగాణ కోసం పోరాటం చేసిన గొప్ప గాంధేయవాది కొండా లక్ష్మణ్ బాపూజీ అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని బాపూజీ కాంస్య విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మూడు తరాల పాటు అలుపెరగని పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి కొండా లక్ష్మణ్ అని కొనియాడారు. జాతికి వారు చేసిన సేవలను భవిష్యత్తు తరాలకు అందించాలన్న లక్ష్యంతో పటాన్‌చెరులో ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసిన అదృష్టం తనకే దక్కిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మధుసూదన్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అశోక్, సీనయ్య, వెంకటేష్, రుద్రారం శంకర్, పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి రఘురాములు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గడ్డపోతారం పట్టణ పరిధిలో..

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం పట్టణ పరిధిలోని మాదారంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక అమరవీరుల స్తూపం వద్ద యువజన వికాస్ సమితి ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యమ స్ఫూర్తిని కొనియాడారు. కార్యక్రమంలో యువజన వికాస్ సమితి ప్రధాన కార్యదర్శి విజయ్‌గౌడ్, మల్లేశ్, రమణ, గణేశ్, చంద్రశేఖర్ మహేశ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మలయాళీలకు అండగా ఉంటాం

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



ఓనం పండుగ వేడుకల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

కూకట్‌పల్లి: ఓనం పండుగ సందర్భంగా మలయాళీలందరికీ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శుభాకాంక్షలు తెలిపారు. నవోదయ మలయాళీ కల్చరల్ అసోసియేషన్ కూకట్‌పల్లి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నైనా గార్డెన్స్‌లో నిర్వహించిన ఓనం పండుగ వేడుకల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూకట్‌పల్లిలో సుమారు 40 ఏళ్ల క్రితమే మలయాళీలు నివాసం ఉండేవారని, వారు ఉండే ప్రాంతానికి కేరళ బస్తీ అనే పేరు వచ్చిందని తెలిపారు. కేరళ ప్రజలకు తెలంగాణ ప్రజలకు మధ్య ఎన్నో ఏళ్లుగా సోదరభావం కొనసాగుతోందని తెలిపారు. మలయాళీలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని, ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అసోసియేషన్ ప్రతినిధులు సురేంద్రన్, బాబు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు షురూ



జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని ముస్తాబైన ఆలయం

రాయదుర్గం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయాలు ముస్తాబు అవుతున్నాయి. సోమవారం నుంచి ఈ ఉత్సవాలను ప్రారంభించి అక్టోబర్ 2 వరకు ఘనంగా నిర్వహించేందుకు భారీగా ఆలయాల్లో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలోని అమ్మవారిని రోజుకో దేవతా మూర్తి అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. గచ్చిబౌలిలోని జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో 22నఅమ్మవారికి బాలాత్రిపుర సుందరిదేవిగా, 23న గాయత్రి దేవిగా, 24న అన్నపూర్ణాదేవిగా, 25న కాత్యాయని దేవిగా, 26న మహాలక్ష్మీగా, 27న లలితాత్రిపుర సుందరిగా, 28న మహాచండీగా, 29న సరస్వతీ దేవిగా, 30న దుర్గాదేవిగా, అక్టోబర్ 1న మహిషాసుర మర్దినిగా, 2న దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని రాజరాజేశ్వరి దేవి అలంకారం చేస్తారు. అదేవిధంగా గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో సోమవారం నుంచి శరన్నవరాత్రి వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇదే విధంగా రాయదుర్గం, గౌలిదొడ్డి, మధురానగర్, ఖాజాగూడ, నానక్‌రాంగూడ, గోపన్‌పల్లి, ఇందిరానగర్, కొండాపూర్, కొత్తగూడ వంటి ఆలయాల్లో కూడా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకారం చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు



మాట్లాడుతున్న హనుమత్ ప్రసాద్

శేరిలింగంపల్లి: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శేరిలింగంపల్లి ప్రశాంత్‌నగర్ బస్తీ ఆధ్వర్యంలో శతాబ్ది ఉత్సవాలు, విజయదశమి ఉత్సవాలు ఘనంగా ఆదివారం నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా సాహితి విద్యా సంస్థల చైర్మన్ డీబీ రావు, ముఖ్య వక్తగా వనవాసి కళ్యాణశ్రమం ప్రాంత సహకోశాధికారి తాడేపల్లి హనుమత్ ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ..దేశం ఎన్నో దాడులను ఎదుర్కొని తట్టుకొని నిలబడగలిగిందన్నారు. స్వాతంత్రోద్య సమయంలో అందరూ కలిసి పోరాటం చేసేలా సమష్టి భావన పెంపొందించాలనే ఉద్దేశంతో 1925లో డాక్టర్ హెడ్గేవార్ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను స్థాపించారని తెలిపారు. ఎక్కడ ప్రకృతి విపత్తులు సంభవించినా మొదట సేవలో నిమగ్నమయ్యేది సేవకులేనని అన్నారు.

ఇండస్ట్రియల్ మెడికల్ గ్యాస్‌లపై ప్రాంతీయ భద్రతా సదస్సు



మాదాపూర్: భద్రతా ప్రమాణాలే పరిశ్రమ ప్రగతికి బలమైన పునాది అని పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోసీవ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్ జాయింట్ చీఫ్ కంట్రోలర్ ఆఫ్ ఎక్స్‌ప్లోసీవ్స్ వికే మిశ్ర తెలిపారు. దేశంలోని పారిశ్రామిక, వైద్య వాయువుల పరిశ్రమ ప్రయోజనాలకు ప్రాతినిత్యం వహిస్తున్న ఆలిండియా ఇండస్ట్రీయల్ గ్యాసెస్ మ్యానుఫాక్చరర్స్ అసోసియేషన్ 50వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఇండస్ట్రియల్ మెడికల్ గ్యాస్‌లపై ప్రాంతీయ భద్రతా సదస్సును మాదాపూర్‌లోని వెస్టిన్ హోటల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భద్రతా ప్రమాణాలు ఉన్నతంగా ఉండాలంటే సిలిండర్ల గుర్తింపు, పీరియాడిక్ టెస్టింగ్, వాడని సిలిండర్లను రద్దు చేయడం వంటి అంశాలపై కఠినంగా ఉండాలన్నారు. ఆలిండియా గ్యాసెస్ మ్యానుఫాక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సాకేత్ టికూ మాట్లాడుతూ..పరిశ్రమ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తూ భద్రత ఆవిష్కరణలకు అగ్రగామిగా ఉందన్నారు. ఈ సదస్సుకు దేశం నలుమూలల నుంచి 200 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారన్నారు. ఆలిండియా ఇండస్ట్రియల్ గ్యాసెస్ మ్యానుఫాక్చరర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రాజీవ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

శివాజీ స్టేడియానికి మోక్షం ఎప్పుడో?

- అసంపూర్తిగా నిలిచిన నిర్మాణ పనులు
- నిరాశలో మండల క్రీడాకారులు



క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

జిన్నారం (పటాన్‌చెరు): క్రీడలంటే ఇష్టం ఉండని వారు ఉండరు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించాలని ఉబలాటపడుతుంటారు. అందుకు అవసరమైన స్టేడియాలు లేకపోవడంతో నిరుత్సాహపడుతుంటారు. పట్టణ కేంద్రంలోని శివాజీ స్టేడియం నిర్మాణానికి మోక్షం లభించడం లేదు. ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కావడం లేదు. ఇది ఎప్పుడు అందుబాటులోకి వస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది. దీంతో ఈ ప్రాంత క్రీడాకారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

మినీ స్టేడియం నిర్మాణం..

జిన్నారం పట్టణ కేంద్ర సమీపంలోని సర్వే నంబర్ 1002లో మినీ స్టేడియం నిర్మాణానికి ఐదు ఎకరాలను కేటాయించారు. మండల క్రీడాకారుల చిరకాల వాంఛ మినీ స్టేడియం నిర్మాణానికి అడుగు ముందుకు పడింది. 2022లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. స్టేడియాన్ని అన్ని హంగులతో తీర్చిదిద్దేలా రూ.10 కోట్లతో పనులు ప్రారంభించారు. ఈ మేరకు స్టేడియంలో రాళ్లను తొలగించి మట్టి పోసి చదును చేశారు. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నా స్టేడియం ఏర్పాటు కల నిజమవుతున్న తరుణంలో ప్రభుత్వాలు మారడంతో పనులు నిర్వహణలో జాప్యం ఏర్పడింది.

మూడేళ్లుగా ముందుకు సాగని పనులు

మినీ స్టేడియం పేరుతో పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం స్థానిక నాయకులు శివాజీ స్టేడియంగా పేరు మార్చి ఇటీవల బోర్డును ఏర్పాటు చేశారు. ఎక్కడి పనులు అక్కడే ఆగిపోవడంతో క్రీడాకారుల్లో నైరాశ్యం నెలకొంది. తమ చిరకాల కోరిక కలగానే మిగిలిపోయిందని వాపోతున్నారు. ప్రభుత్వాలు మారడంతో నిధుల కొరత ఏర్పడి పనులు ఆగిపోయాయని చెబుతున్నారు. ఉమ్మడి జిన్నారం, గుమ్మడిదల మండలం నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఉన్నారు. స్టేడియం నిర్మాణ పనులు ఆగిపోవడంతో క్రీడాకారులు మండిపడుతున్నారు. స్టేడియం నిర్మాణంపై రాజకీయాలు వద్దని చెబుతున్నారు.

స్వచ్ఛందంగా పిచ్ ఏర్పాటు

పట్టణానికి చెందిన క్రీడాకారులు తమ సొంత నిధులను పోగుచేసుకొని స్టేడియంలో క్రికెట్ పిచ్‌ను నిర్మించుకున్నారు. క్రికెట్ అంటే ఆసక్తి గల క్రీడాకారులు మండలంలో పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఓవైపు ఐపీఎల్ తరహా పోటీలను వీక్షిస్తున్న క్రీడాకారులు అదే తరహాలో అసంపూర్తిగా నిర్మించిన స్టేడియంలో తరచూ పోటీలను నిర్వహించుకుంటూ తమ క్రీడా ఆసక్తిని చాటుతున్నారు. ముఖ్యంగా స్థానిక నాయకుల సహకారంతో క్రికెట్ టోర్నీల్లో పాల్గొంటూ క్రీడాస్ఫూర్తిని చాటుతున్నారు. గెలిచిన విజేతలకు నగదు పారితోషకాలతో పాటు ఐపీఎల్ తరహాలో ట్రోఫీలను అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు.

నిర్మాణం చూసి మురిసిపోయా...



ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన స్టేడియం నిర్మాణం ప్రారంభమైన కొన్ని రోజుల్లోనే మూలాన పడింది. స్టేడియం చదును పనులు చూసి ఎంతో ముచ్చట పడ్డాను. అన్ని హంగులతో చూస్తాననుకున్న.. పనులు ఆగిపోవడంతో ఇప్పుడు పరిస్థితి అందుకు భిన్నంగా మారింది.

-పవన్, క్రీడాకారుడు

భక్తిశ్రద్ధలతో బతుకమ్మ వేడుకలు

శేరిలింగంపల్లి: తెలంగాణ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. శేరిలింగంపల్లి ప్రాంతంలోని కాలనీలు, బస్తీలలో మహిళలు తీరొక్క పూలను తీసుకొచ్చి వాటిని బతుకమ్మగా పేర్చి ప్రత్యేక పూజలను నిర్వహించి బతుకమ్మ ఆడుతూ, పాడుతూ ఘనంగా వేడుకలను ప్రారంభించారు. అనంతరం బతుకమ్మ పాటలతో ఆయా ప్రాంతాలలో సందడి వాతావరణం నెలకొంది.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: బతుకమ్మ వేడుకలను గచ్చిబౌలిలోని నాగార్జున రెసిడెన్సీ గేటెడ్ కమ్యూనిటీలో ఆదివారం సాయంత్రం నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం బతుకమ్మ పాటలు పాడుతూ ఆడుతూ మహిళలు వేడుకల్లో పాల్గొన్నారు.

నిమజ్జన కోనేరు లేని నీరు..మహిళల ఆగ్రహం..

రాయదుర్గం: ప్రతియేటా రాయదుర్గంలో బతుకమ్మ కాలనీలో ఆడిన తర్వాత మహిళలంతా మల్కంచెరువు వద్ద ఉండే గణేష్ నిమజ్జన కోనేరు వద్దకు వచ్చి అక్కడ కొద్దిసేపు బతుకమ్మ ఆడి ఆతర్వాత కోనేరులో నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తోంది. కానీ ఈ ఏడాది కోనేరును పరిశుభ్రంగా లేకపోవడం ఒక్క ఫీటు కన్నా తక్కువ స్థాయిలో నీరు ఉండడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



రాయదుర్గంలోని మల్కంచెరువు వద్ద..



శేరిలింగంపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



గచ్చిబౌలిలోని నాగార్జున రెసిడెన్సీ గేటెడ్ కమ్యూనిటీలో..